గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై

దృష్టి సారించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్ సూచన - నెరవాడలో గిరిజనులతో ముఖాముఖి



మాట్లాడుతున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



స్వయం సహాయక సంఘాలకు రూ.4.16 కోట్ల మెగా చెక్‌ను అందజేస్తున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరి చందన్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/పాణ్యం

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరి చందన్ సూచించారు. శుక్రవారం పాణ్యం మండలం నెరవాడ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గిరిజనులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్ అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నెరవాడకు చేరుకున్నారు. పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఆయన సందర్శించారు. అనంతరం వేదిక మీద ఆయన మాట్లాడారు. 'ఆదివాసీలకు, మహిళా సంఘాలకు అందరికీ నమస్కారం' అంటూ గవర్నర్ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సంక్షేమ పథకాలు గిరిజనులందరికీ అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గిరిజనులందరూ పిల్లలను పాఠశాలలకు పంపాలని, విద్య ద్వారా మంచి ఉద్యోగాలు వస్తాయని, వారు దేశానికి, సమాజానికి సేవ చేయగలరని తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఏజెన్సీ గ్రామాలకు కూడా వైద్య సేవలను విస్తరించామని, గిరిజన ఆశ్రమ పాఠశాలలను, గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వాలు ఉన్నత విద్యకు అందించే అవకాశాలను, నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పీడిత రాజన్న దొర మాట్లాడారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరిక మేరకు విద్యాలయాల్లో సీట్లు వారికే కేటాయిస్తామని తెలిపారు. గిరిజన సంక్షేమానికి గత ప్రభుత్వం రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే, జగన్ ప్రభుత్వం రూ.16 వేల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. అటవీ హక్కుల పత్రాలు గిరిజనులకు అందేలా చూడాలని, గిరిజనులకు ఇల్లు ఇవ్వడంలో జాప్యం జరగకుండా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. విద్యుత్ లేని గూడేలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. రోడ్లు లేని గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ... వివిధ పథకాల రూపంలో ప్రభుత్వం గిరిజనులకు లబ్ధి చేకూరుస్తోందన్నారు. చిన్న తరహా ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకోవడం ద్వారా ఇక్కడి గిరిజనులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... గిరిజన పాఠశాలల్లో ఖాళీ సీట్లను గిరిజనులతో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్తగా ఇల్లు మంజూరు చేయాలని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రూ.4.16 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్రా రెడ్డి, ఆర్థర్, ఎమ్మెల్సీ ఇసాక్, జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జాహ్నవి, నంద్యాల కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గిరిజనులతో గవర్నర్ ముఖాముఖి కార్యక్రమానికి ముందు విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నెరవాడ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, పిజిటి చెంచు, పాణ్యం కెఆర్‌ఆర్ పాఠశాల, నెరవాడ బీసీ సంక్షేమ పాఠశాల విద్యార్థినులు తెలుగు భాష తియ్యదనం, అడవి తల్లికి దండాలు, డిబిరి డిబిరి, లంబాడీ నృత్యాలు సభకు వచ్చిన వారిని ఆకట్టుకున్నాయి.

ఇంకా పథకాలను అందిస్తారని..

- ఇండ్ల ఉషారాణి, నంద్యాల

పూర్వీకులు పంటలను నష్టం చేసే ఎలుకలు, పాములను పట్టుకొని జీవనం గడిపేవారు. తర్వాత ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి ఇల్లు నిర్మించి ఇచ్చింది. విద్యను అందిస్తోంది. ఇంకా పథకాలను గిరిజనులకు అందిస్తారని ఆశిస్తున్నాం.

ఇంకా ఇళ్లు ఇవ్వాలి

- ఎం.పల్లవి, పాణ్యం సర్పంచి.

మా పూర్వీకులు నల్లమలలో నివసిస్తూ జంతువులను వేటాడి ఆహారంగా తీసుకునేవాళ్లు. చెట్ల నుంచి వచ్చే తేనే, ఉసిరి, వేర్లను అమ్ముకుంటూ బతికేవాళ్లు. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు చాలా అభివృద్ధి సాధించాం. దీనికి నవరత్నాలే కారణం. కుటుంబాలు పెరుగుతున్నాయి.. వాటికి అనుగుణంగా ఇంకా ఇల్లు ఇవ్వాలి. మాకు ఉపాధి హామీ తీసేశారు. దానిని మళ్లీ అమలు చేయాలి.

హెల్మెట్ తప్పనిసరి

- వాహనదారులకు అవగాహన కల్పించాలి
- ఆర్‌యు విసి ఆనందరావు
- వాక్థాన్ ర్యాలీని ప్రారంభించిన విసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ఆనందరావు తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం 34వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కర్నూలు రోడ్డు రవాణా శాఖ, కర్నూలు ట్రాఫిక్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో వాక్థాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి సిక్యాంపు సెంటర్ వరకు సాగింది. ర్యాలీని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి ఆనందరావు, ఉప రవాణా కమిషనర్ కె.శ్రీధర్ మాట్లాడారు. ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. లేకపోతే ఎంవిఐ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి తెలియజేయాలని సూచించారు. యువత అత్యుత్సాహంతో అతివేగంగా వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాల బారి పడకూడదన్నారు. రీజినల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం పాల్గొన్నారు.



రోడ్డు భద్రత వారోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌యు విసి ఆనందరావు

డిఇఒపై ఆగ్రహం

- వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో అవకతవకలు

- నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ నిర్వహణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియలో డిఇఒ వెంకట రంగారెడ్డి వ్యవహరించిన తీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియను నిర్వహించడం పట్ల మండిపడడమే కాక శాఖ పరమైన చర్యలు కూడా తీసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్, తాత్కాలిక పదోన్నతుల ప్రక్రియ నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా అర్హత ఉన్న వారికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద భర్తీ చేయాలని ఆదేశించింది. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ కింద తాత్కాలికంగా ఎస్‌జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి తాత్కాలికంగా రూ.2500 చొప్పున అలవెన్స్ ఇస్తూ వారికి పదోన్నతులు కల్పించింది. ఈ ప్రక్రియను మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించాల్సి ఉండగా డిఇఒ వెంకట రంగారెడ్డి జిల్లా స్థాయిలోనే కౌన్సెలింగ్ నిర్వహించారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను చేపట్టారు. జిల్లాలో గతేడాది అక్టోబర్‌లో ఎస్‌జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. 70 శాతం మందికి పదోన్నతులు కల్పించగా మిగిలిన 30 శాతం పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా వాటిని కూడా పదోన్నతులు కల్పించి భర్తీ చేశారు. ఇప్పుడు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద సీనియర్లకు పదోన్నతులు కల్పించిన వారి నుంచి విల్లింగ్ తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో మాత్రం సీనియర్ల నుంచి విల్లింగ్ తీసుకోకుండా నేరుగా జూనియర్లకు ప్రాధాన్యత కల్పిస్తూ స్థానాలు ఇవ్వడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను నేరుగా ఆయా మండలాలు, డివిజన్ స్థాయిలో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాత్రం జిల్లా కేంద్రంలో నిర్వహించడం వల్ల నిబంధనలు పాటించలేదని విద్యాశాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లాలో చేపట్టిన ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి బొత్స సత్యనారాయణ కూడా డిఇఒ తీరు పట్ల మండిపడినట్లు సమాచారం. డిఇఒపై కూడా శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కూడా కోరుతున్నారు.

జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద చేపట్టిన వివరాలు

సబ్జెక్టు	70 శాతం కోటా కింద	30 శాతం కింద చేపట్టిన పదోన్నతులు
గణితం	226	12
భౌతిక శాస్త్రం	76	8
జీవశాస్త్రం	158	7
సాంఘిక శాస్త్రం	181	9
ఆంగ్లం	226	52
తెలుగు	124	---
హిందీ	54	---
ఉర్దూ	2	---
కన్నడ	6	---



రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం

అమలుకు ఆర్డినెన్స్ తేవాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు - నగరంలో కెవిపిఎస్ రాస్తారోకో

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

దళిత, గిరిజనుల జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించి, దళితులకే ఖర్చు చేసేలా పోరాడి సాధించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేసేలా ఆర్డినెన్స్ తేవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని అంబేద్కర్ భవన్ నుంచి రాజ్ విహార్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం రాజ్‌విహార్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. కెవిపిఎస్ ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఆర్.రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.భాస్కర్, ఆంథ్రా గురుస్వామి, ఆర్.పెద్దబాబు మాట్లాడారు. తరతరాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఖర్చు చేయించేలా పోరాడి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సాధించినట్లు తెలిపారు. సంపూర్ణంగా ఉపయోగపడకుండానే చట్టం కాల పరిమితి 2023 జనవరి 23 నాటికి ముగియబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌ప్లాన్ చట్టం శాశ్వతంగా కొనసాగాలంటే ప్రత్యేక శాసనసభ సమావేశాలు నిర్వహించి వెంటనే ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కోరారు. ప్రత్యేక నిధుల కేటాయింపు కోసం చట్టమున్నా దగా చేస్తున్న పాలకులు చట్టం గడువు ముగిస్తే దళితుల బతుకులను, ఆర్థిక హక్కులను చెత్తబుట్టలో పడేస్తారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఏసు రాజు, చిరంజీవి, రోశయ్య, వెంకటేష్, నాయకులు వెంకటస్వామి, సరోజమ్మ, మరియమ్మ, శాంతమ్మ, జయరాముడు, వెంకటేశ్వర్లు, నరసింహుడు, చంద్ర, బాలు, శ్యామ్సన్, కిరణ్, రాఘవేంద్ర, రవి, సురేష్, డేవిడ్, నాగరాజు, ఏసన్న, రామాంజనేయులు, చిటికెల చిన్న రాముడు, ఏసు, దాసు, సురేష్, శేఖర్, చిన్న లక్ష్మన్న, దేవకుమార్, హనుమంతు, రాజు, రత్నం, మద్దిలేటి, అనిల్ పాల్గొన్నారు.

కళాకారులకు ఆడిటోరియం : మేయర్

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

మున్సిపల్ కాంప్లెక్స్ భవనం పైన కళాకారులకు ఆడిటోరియం నిర్మించాలని కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర మేయర్ బివై రామయ్యను, కమిషనర్ భార్గవతేజను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. మున్సిపల్ ఓపెన్ థియేటర్ పడగొట్టినప్పుడు పునర్నిర్మిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని వినతిపత్రంలో గుర్తుచేశారు. హామీ ఇచ్చినమాట వాస్తవమేనని, నిర్మాణం చేపడతామని మేయర్, కమిషనర్లు హామీ ఇచ్చారని సంఘం అధ్యక్షులు జి అంకయ్య, జనరల్ సెక్రటరీ పి హనుమంతరావు చౌదరి, గౌరవ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డిలు తెలిపారు. నాయకులు సిబి అజయ్ కుమార్, రోషన్ అలీ, చాంద్ భాషా, కళా ప్రియ, తిరుపాలు, మనోహర్ బాబు, ఆనందరావు, పిజి వెంకటేశ్వర్లు, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మారందొడ్డి దంపతులు హైదరాబాద్‌లో ఆత్మహత్య

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని మారందొడ్డికి చెందిన దంపతులు పద్మాచారి (26), మౌనిక (23) హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకొంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు. పద్మాచారి హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో కార్పెంటర్ వర్క్ చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వలన ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని కుటుంబీలకు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం లక్ష్యంగా పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మొత్తం 27 మంది హెల్త్ మెడికల్ సమస్యలు, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిపిఓ ఏఓ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి

30న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

చేతి వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాలని, సామాజిక రక్షణ, సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేయాలనే అంశాలపై ఎపి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న విజయవాడ మాకినేని బసవన్న విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం కోరుతూ శుక్రవారం స్థానిక కెకె భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ సి.గురు శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గొర్రెల మేకల పెంపక దారుల జిల్లా ప్రధాన కార్యదర్శి పి. గోవిందు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు శేషాపణి, నాయి బ్రాహ్మణ సంఘం నగర కార్యదర్శి ఈశ్వరయ్య, మహిళా సంఘం జిల్లా నాయకురాలు పిఎస్.సుజాత, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్‌లు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై, వృత్తిదారులపై మోయలేని భారాలు మోపుతూ కల్లబొల్లి మాటలతో కాలం గడుపుతుందని అన్నారు. బిసి అని చెప్పుకునే ప్రధానమంత్రి బీసీల్లో ఉన్న అత్యంత వెనకబడిన వృత్తిదారులకు చేసింది ఏమీ లేదన్నారు. వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ సి. గురుశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 56 రకాల కార్పొరేషన్లు చేతివృత్తిదారులకు, అభివృద్ధి-సంక్షేమం కార్పొరేషన్లు చేసినట్లుగా గొప్పగా ప్రకటించి నిధులు విడుదల చేయకుండా, విధివిధానాలు రూపొందించకుండా కేవలం చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి వారికి రాజకీయ ఉపాధి కల్పించి, గౌరవ వేతనాలు చెల్లిస్తూ బిసి వృత్తిదారులను తీవ్ర మోసం చేసిందని అన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వత్తిదారుల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడి వృత్తిదారుల ప్రయోజనాలు, సంక్షేమానికి కేటాయించిన నిధులు ఖర్చు చేయాలన్నారు. ఈ నెల 30న విజయవాడ మాకినేని బసవన్న విజ్ఞాన కేంద్రంలో జరుగు రాష్ట్ర సదస్సులో వృత్తిదారులు వేలాది మందిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రజక వృత్తిదాల సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న, ఉపాధ్యక్షులు శేఖర్ బాబు. పర్ల సుంకన్న. సహకార దర్శులు జయమ్మ. రాముడు. చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాల్లప్ప. చేనేత కార్మిక సంఘం నాయకులు శ్రీను. ఈరన్న. తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు. మండల్లాలో రౌండ్ టేబుల్ సమా వేశాలు, చర్చ వేదికలు సభలు జరపాలని తీర్మానించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు. గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా నాయకులు మద్దిలేటి, రవి శేఖర్, చేనేత, రజక, మత్స్య కార్మిక తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు గురుశేఖర్

భారత జూడో పోటీలకు సహకారం అందిస్తా

- జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు కర్నూల్ కేంద్రంగా జరగబోయే దక్షిణ భారత స్థాయి ఖేలో ఇండియా జూడో పోటీలకు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎపి జూడో సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోటీల బ్రోచర్‌ను నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా క్రీడా శాఖ సీఈవో పివి రమణ, రాష్ట్ర జూడో సంఘం సీఈఓ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌లతో కలసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ 6 రాష్ట్రాల నుంచి మహిళా క్రీడాకారులు నాలుగు కేటగిరీలో సుమారుగా 1800 మంది ప్రాతినిత్యం వహించనున్నారని చెప్పారు. పోటీలు కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, కర్నూలు జిల్లా జూడో సంఘం సెక్రెటరీ శ్రీకాంత్, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 21వ వార్డ్ యస్‌సిఐ కాలనీ-1 ఆంజనేయస్వామి ఆలయం నుండి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో పర్యటించి ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని, ప్రభుత్వ వైఫల్యాలు, ధరల పెంపు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల గురించి స్థానిక కాలనీ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డ్ ముఖ్య నాయకులు రాఘవేంద్ర రెడ్డి, విష్ణు, బాబు రాజు, వార్డ్ మహిళ నాయకురాలు లలిత, లక్ష్మణ్,తెలుగు యువత రాష్ట ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మదు నాయక్, సుజిత్, భరత్ నాయక్,శివ కష్ణ, శీను, వినోద్ రెడ్డి, అశోక్ నాయక్, జగన్, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **తుగ్గలి :** మండలం పరిధిలోని మామిళ్ళకుంట గ్రామంలో టిడిపి పత్తికొండ నియోజకవర్గ ఇన్చార్జి కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు ఆధ్వర్యంలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా తుగ్గలి మండలంలోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని ఇంతవరకు అందించకపోకపోవడం విచారకరమన్నారు.క్లస్టర్ ఇంచార్జి తిమ్మప్ప, ఉపాధ్యక్షులు వెంకటరాముల చౌదరి, నీలకంఠ, అనుమప్ప, ఎల్లప్ప శాంతమూర్తి సత్తారో తదితరులు పాల్గొన్నారు.



వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

వలసలు నివారించండి : వ్యకాసం

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయని, వెంటనే ఉపాధి కూలీలకు పనులు కల్పించి వసలు నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వ్యకాస నాయకులు ఆర్డిఓ మోహన్ దాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులు లేక పొట్ట చేత పట్టుకొని సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. ఎకరాకు రెండు క్వింటాలు పత్తి దిగుబడి రాలేదని, చేసిన అప్పులు తీర్చలేక సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. దేవనకొండ, తుగ్గలి, క్రిష్ణగిరి, మద్దికేర, ఆస్పరి, ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, పత్తికొండ మండలాల్లో వలసలు తీవ్రంగా ఉన్నాయని, వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలను ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఇఒ ఇందిర శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులను, డిజిటల్ తరగతి వినియోగాన్ని, వర్క్ బుక్ యాక్టివిక్టిస్, తాగునీరు, టాయిలెట్లు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోజనం చేసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుశీల, వరలక్ష్మి, సర్పంచు లక్ష్మీదేవి, వైసీపీ నాయకులు ఎల్లస్వామిలు పాల్గొన్నారు.

తాత్కాల్ కింద టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మార్చిలో జరిగే టెన్త్ పరీక్షలు రాసే దుగ్గాను తాత్కాల్ పద్ధతిలో ఫీజు చెల్లింపునకు అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 26వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రూ. 1000 అపరాధ రుసుముతో ఈ నెల 31లోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు

నల్లగుండ్లలో రాతి దూలం పోటీలు

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని నల్లగుండ్ల గ్రామంలో మునిస్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన రాతిదూలం పోటీలను నునుసరాల సర్పంచ్ దారెడ్డి గోపాల్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుమూల గ్రామాలలో కూడా రాతిదూలం పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బహుమతుల దాతలు కాశీం, కమల్ వలి, లొద్ద కిష్టప్ప, వడ్డే మునిస్వామి, కురువ శ్రీకాంత్, గిడ్డయ్య, రవికుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సైకో జగన్ పోవాలి.. బాబు సైకిల్ రావాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య


కాత్రికిలో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సైకో జగన్ పోవాలని, బాబు సైకిల్ రావాలని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాత్రికి గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైకో జగన్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడమే కాక గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. అధికార పార్టీకి ఓటు వేసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ పాలన ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఆదిఎప్ప గౌడ్, సిద్దప్ప, చంద్ర, బంగారయ్య, నాగేష్, ఈరన్న, రామలింగ, కృష్ణ, రహిమాన్, మూకన్న, వెంకోబా పాల్గొన్నారు.

విశ్వాసమే విజయానికి నాంది

- వైసిపి యువ నాయకులు జయమనోజ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని


క్రీడాకారులకు అభివాదం చేస్తున్న జయమనోజ్ రెడ్డి

క్రీడలు, చదువు ఇలా ఏ రంగంలోనైనా ఆత్మ విశ్వాసమే విజయానికి నాంది అవుతుందని వైసిపి యువ నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కిడ్డీస్ పాఠశాలలో డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులకు ప్రేరణ కథ చెప్పి ఆత్మ విశ్వాసాన్ని నింపారు. పాఠశాల డైరెక్టర్స్ కేశవ నారాయణ రెడ్డి, చిన్నప్ప రెడ్డి మాట్లాడుతూ... గ్లోబల్ రంగంలో విద్యార్థులు మొబైల్‌ను ఎక్కువగా వాడుతున్నారని, దాని వల్ల పర్యావసానమే తప్పితే లాభం తక్కువ అని తెలిపారు. మైదానంలో క్రీడలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢత్వంతోపాటు ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్ చూపరులను ఆకట్టుకుంది. పాఠశాల సిబ్బంది, వైసిపి నాయకులు సన్నీ, పెద్దిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే డయాబెటిస్ నియంత్రణ

- ఐఎంఎ సెంట్రల్‌వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తినే ఆహారంతోపాటు వ్యాయామం చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు రాకుండా కాపాడుకోవచ్చని ఐఎంఎ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉచిత డయాబెటిస్ నిర్ధారణ క్యాంపులో 120 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డయాబెటిస్ (చక్కర వ్యాధి) వ్యాధిగ్రస్తులు రోజురోజుకు దేశంలో ఎక్కువ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని సూచించారు. ఇది చాలా రోజులు ఉంటే కిడ్నీలు, రక్తనాళాలు, నరాలు, కళ్లు దెబ్బతినే అవకాశముందని తెలిపారు. ఐఎంఎ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ కృష్ణమూర్తి, అధ్యక్షులు ఉషా రావు, సెక్రటరీ కిరణ్ కుమార్, లయన్స్ క్లబ్ తరపున జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, సభ్యులు వనప రాజు, గోవిందరావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మితే చర్యలు : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

కర్ణాటక అక్రమ మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ వెంకటయ్య, ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. చిప్పగిరి, బండనహాల్ గ్రామాల్లో అక్రమ మద్యంపై సోదాలు నిర్వహించామన్నారు. బోయ ఎల్లమ్మ, కొండ రాము ఇళ్లలో కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో పేకాట, మట్కా, గుట్కా, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. చంద్రన్న పాల్గొన్నారు.

సుగ్గి బాట పట్టిన పల్లె ప్రజలు

- ఖాళీ అవుతున్న గ్రామాలు
- వర్షాలతో దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలోని పశ్చిమ ప్రాంత పల్లెలు సుగ్గి బాట పట్టాయి. ఈ ప్రాంతంలో ఈ ఏడాది పంటలు అధిక వర్షాలకు దెబ్బ తినడంతో వ్యవసాయ కూలీలకు పని దొరకడం కష్టమైంది. పశ్చిమ ప్రాంతమైన ఆదోని, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాల్లో ప్రధానంగా పత్తి, మిరప, వరి పంటలను సాగు చేశారు. వరి పంట కోతకు యంత్రాలు రావడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. మిరప పంట వైరస్ సోకడంతో దిగుబడి లేక పొలాలు వెలవెలబోతున్నాయి. పత్తి పంట అధిక వర్షాలకు దెబ్బ తినడంతో ఒక ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు వచ్చే పంట కేవలం 2 నుంచి 4 కింటాళ్ల దిగుబడి వచ్చింది. పత్తి పొలాల్లో కూడా పనులు లేకుండా పోయాయి. గతంలో తుంగభద్ర దిగువ కాలువ కింద, తుంగభద్ర నది పరిసర ప్రాంతాల్లో సాగయిన పొలాల్లో ఫిబ్రవరి నుంచి మార్చి చివరి వరకు వ్యవసాయ కూలీలకు పనులు ఉండేవి. ఈ ఏడాది పంటలన్నీ దెబ్బ తినడంతో వ్యవసాయ కూలీలకు పనులు లేకపోవడంతో పల్లె ప్రజలు సుగ్గి బాట పట్టక తప్పలేదు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతాల నుంచి వలసలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక్కడ నుంచి ఎక్కువగా గుంటూరు ప్రాంతానికి వలసలు వెళ్తున్నారు. తమ పిల్లలను, వృద్ధులను, పాడి పశువులను ఇంటి దగ్గరే వదిలి మూటాముల్లే సర్దుకుని బొలెరో, లారీల్లో వలసలు పోతున్నారు. కౌతాళం మండలంలో తిప్పలదొడ్డి, గోతులదొడ్డి, చిరుతపల్లి, హాల్వి, ఉరుకుంద, మధిర, పొదలకుంట, సులేకేరి, కాత్రికి, అగసలదిన్నె, కౌతాళం తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వలసలు వెళ్లారు. మండలంలో ఇప్పటికే సుమారు 12 నుంచి 15 వేల మంది వలసలు వెళ్లారు. ఇంకా వలసలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కౌతాళం మండలం నుంచే కాక కోసిగి, పెద్దకడబూరు మండలాల నుంచి కూడా ఎక్కువగా వలసలు వెళ్తున్నారు. ఉన్నతాధికారులు పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి పనులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


వలస వెళ్తున్న ప్రజలు

పరిశ్రమలు స్థాపించాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య



జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో ప్రతేడాది వలసలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వ్యవసాయ కూలీలతో పాటు సన్న, చిన్నకారు రైతులు వలసలు వెళ్తున్నారు. ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసినా బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఈ చట్టంపై కూలీలు సుముఖత చూపడం లేదు. కూలీలు గుంటూరు, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, హుబ్లీ తదితర సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. వలసలు నివారణ కోసం ఉపాధి హామీ చట్టం పనులతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారానే ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. అధికారులు స్పందించి పశ్చిమ ప్రాంత మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

ఉపాధి పనులు కల్పిస్తున్నాం

- ఎపిఒ జుబేర్



మండలంలో 26 పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 1,650 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. 6 గంటలు పని చేస్తే రూ.257 కూలి అందిస్తున్నాం. కూలీల సంఖ్య పెంచేందుకు గ్రామాలవారీగా లేబర్ మొబిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి గ్రామంలో సమావేశం నిర్వహించి వలసలు నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నాం. ఎవరూ వలసలు వెళ్లవద్దు. ఈ వారం రోజుల్లో 2,500 మంది కూలీలు పనికి వస్తామని చెప్పారు.

పాఠశాల భవన ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం, రాఘవేంద్రస్వామి కొలువైన మంత్రాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం ప్రారంభోత్సవ ఏర్పాట్లను వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య పరిశీలించారు. శుక్రవారం తుది మెరుగులు దిద్దుకుంటున్న భవన సముదాయాన్ని పరిశీలించిన వారు ప్రజాశక్తితో మాట్లాడారు. సమస్యలను జయించి నిర్మించిన ఈ పాఠశాల భవనం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధంగా ఉందని చెప్పారు. నాబార్డు నిధులు రూ.4.38 కోట్లతో నిర్మించిన రెండంతస్తుల పాఠశాల నూతన భవనాన్ని ఈ నెల 22న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల నిర్మాణం వెనుక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాత్ర ఉందని, స్థల దాతగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో పాఠశాల నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇన్‌ఛార్జీ ఇఇ కర్రెన్న, ఎఇ ఖాజా మొయినుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య, పిఇటి నరసింహరాజు, వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, వికెసి రఘు, కాంట్రాక్టర్ కరుణాకర్ రెడ్డి ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

- ఇఒఆర్‌డి సంజన్న, పంచాయతీ కార్యదర్శి బాలన్న


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యాలు కూడా పదిలంగా ఉంటాయని ఇఒఆర్‌డి సంజన్న, పంచాయతీ కార్యదర్శి బాలన్న ప్రజలకు సూచించారు. శుక్రవారం నేమకల్లు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటి పరిసరాలతో పాటు వీధి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు, అంటువ్యాధులు దరిచేరవని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటిలోని వేస్ట్ వస్తువులను, మురుగునీటిని బయట పడేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ ఎఎన్ఎం సువర్ణ, అంగన్వాడీ టీచర్ బాల రంగమ్మ పాల్గొన్నారు.

'ఆడపిల్లలకు చదువు ముద్దు '

ప్రజాశక్తి - చిప్పగిరి

ఇంట్లో పుట్టిన ఆడపిల్లలను చదువుతో ముందుకు తీసుకెళ్లాలని, బాల్య వివాహాలు చేయవద్దని అంగన్వాడీ టీచర్లు బాల రంగమ్మ, వన్నూరుబీ, పార్వతి సూచించారు. శుక్రవారం నేమకల్లు గ్రామంలో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గ్రామంలోని పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆడపిల్లలకు చదువు ముద్దు, బాల్య వివాహాలు మంచిది కాదని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి తల్లిదండ్రులూ ఆడపిల్లలను మంచి చదువు చదివించి భవిష్యత్తుకు మంచి పునాది వేయాలని తెలిపారు. ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది


పండ్ల తోటను పరిశీలిస్తున్న పిడీ అమరనాథ్‌రెడ్డి

పండ్ల తోటలతో అభివృద్ధి చెందాలి

- డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద రాయితీతో అందిస్తున్న పండ్ల మొక్కలను తీసుకొని వాటి ద్వారా రైతులు అభివృద్ధి చెందాలని డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని మాచాపురం హార్టికల్చర్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రైతూ ఉపాధి హామీ చట్టం కింద ఉచితంగా ఇచ్చే హార్టికల్చర్ పంటలను వేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అలాగే జాబ్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబమూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్ కార్డు కలిగి ఇంటి ఆవరణం ఉన్న వారికి 5 మునగ మొక్కలు ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారిని గుర్తించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఎపిఒ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

22న ములుగుందంలో టెంకాయల వేలం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన శ్రీదస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈనెల 22న దర్గాలో టెంకాయల వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని కోరారు. వేలం దక్కించుకున్న వారు అదే రోజు 25 శాతం చెల్లించాలన్నారు. వివరాల కోసం 9705107989 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

మోసాలు, నేరాలపై అవగాహన అవసరం

- ఎస్ఐ వేణుగోపాల్ రాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలపై ప్రజల్లో అవగాహన ఉండాలని ఎస్ఐ వేణుగోపాల్ రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని చిలుకలడోన గ్రామంలో సిబ్బందితో కలిసి పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. అత్యాశ వల్ల సైబర్ నేరాలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. రుణ యాప్‌ల ద్వారా అధిక వడ్డీలకు రుణాలు పొంది కట్టలేక కొన్ని ప్రాంతాల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత నియమాలు పాటించక ప్రమాదాలు జరుగుతున్నాయని, అధిగమించాలని చెప్పారు. మహిళల అత్యాచారాలపై కఠిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై గ్రామస్తులతో సంభాషించారు. కర్ణాటక మద్యం విక్రయాలు, భూ వివాదాలపై అవగాహన కల్పించారు.

టిడిపి నాయకుల మాటలు నమ్మవద్దు...

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

సంక్షేమ ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఓర్వలేక టిడిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారి మాట నమ్మవద్దని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రతి గడపకూ తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో మురుగు కాలువలు, వీధి లైట్లు, రోడ్లు పరిశీలిస్తూ పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రజలకు అవినీతి రహిత పాలనకు నాంది పలికారన్నారు. మూడున్నర సంవత్సరాల్లోనే ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి పనులు చేసి చూపించారని తెలిపారు. ఆదోని అభివృద్ధిని టిడిపి నాయకులు విస్మరించి ప్రస్తుతం వారి పబ్బం గడుపుకునేందుకు గాలి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వార్డు కౌన్సిలర్ ఉమామహేశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, నాయకులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే


మాట్లాడుతున్న అధికారులు

అధికారులతో సూచనలతో అధిక దిగుబడులు

- నదికైరవాడిలో క్లస్టర్ స్థాయి పొలంబడి

ప్రజాశక్తి - నందవరం

వ్యవసాయ అధికారుల సలహా, సూచనలను రైతులు పాటించి, అధిక దిగుబడి సాధించాలని ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ సంచాలకులు మహ్మద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని నదికైరవాడి గ్రామంలోని వరి పొలంలో క్లస్టర్ స్థాయి పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతులతో పొలాల మధ్య పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొలంలో వేసే నాటుకు సంబంధించిన రెండు విషయాలు సదుపాయం కర్త (పొలం బడి రైతు)తో చూపించారు. అందులో మొదటిది కాలిబాటలని, వాటిలో నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు బాటలు తీయటం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపు చేయవచ్చని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితిని గమనించడానికి కూడా ఈ బాటలు ఉపయోగపడతాయని వివరించారు. ఇక రెండోది చదరపు మీటరుకు 66 మొక్కలు ఉండేలా చూడాలని సూచించారు. ఎఒ స్రవంతి, ఎఇఒ ప్రభావతి పాల్గొన్నారు.

'ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి'

ప్రజాశక్తి - ఆస్పరి

జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పోరు బాట గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.80 లక్షలు తాపీ మేస్త్రీకే సరిపోతుందన్నారు. ప్రభుత్వం స్పందించి రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, ఉరుకుందు, ఈరన్న, రామచంద్ర, రంగస్వామి, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయికి ఎదగాలి

- రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఉప్పర కల్యాణ మండపంలో రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ వైభవంగా జరిగింది. ముందుగా కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. రావూస్ కళాశాల ఫౌండర్ కీర్తిశేషులు బూదూరు వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఫ్రెషర్స్ పార్టీనుద్దేశించి తిరుమలరెడ్డి మాట్లాడారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను రావూస్ డిగ్రీ కళాశాల అందిస్తుందని, ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రావూస్ కళాశాల చదువులో ర్యాంకులకు, క్రీడల్లో పతకాలకు కేరాఫ్ అడ్రస్ అని గుర్తు చేశారు. చదువుతోపాటు ప్రతేడాది ఉద్యోగాల కోసం ప్రత్యేక జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణలో సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు ఆదర్శవంతంగా ఉండాలని కోరారు.

ఆటపాటలతో అలకరించిన విద్యార్థులు

రావూస్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. రాజేశ్వరి టీం క్లాసికల్ డ్యాన్స్‌తో అందరినీ ఆకట్టుకొన్నారు. షోలో డ్యాన్స్, టీం మిక్సింగ్ డ్యాన్స్‌లతో విద్యార్థులు భళా అనిపించారు. అనంతరం కళాశాలలో ఫ్రెషర్స్ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి మెడల్స్ అందజేశారు. కళాశాల అధ్యాపకులు పుల్లయ్య, వెంకటేశులు, నూర్ బాషా, రామకృష్ణ, రాఘవేంద్ర, విజయ్ కుమార్, విజయరాజు, అన్నపూర్ణ, రాజేశ్వరి, నందిని, మనోవెంకట్, మహానోర్, జయలక్ష్మి, నరసింహుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రావూస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వీధి కుక్కలతో బెంబేలు

ప్రజాశక్తి - హొళగుంద

వీధి కుక్కలు కొరికితే అంతే మరి అని గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. హొళగుందతోపాటు మండలంలోని ఎల్లార్తి, వందవాకిలి, గజ్జల్లి, హెబ్బటం, సులువాయి తదితర గ్రామాల్లో ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల గుంపు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇందులో మంచి కుక్కలు, పిచ్చి కుక్కలు కలిసి తిరగడంతో కుక్కల నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక ఆదమరిచి తిరిగితే అంతే... కుక్క కాటుకు బలి కాక తప్పదు. రాత్రి 8 గంటలు దాటితే ద్విచక్ర వాహనదారులను వెంటాడి కొరికే ప్రయత్నం చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు కుక్కలు వీధిలో ఒకటో, రెండో ఉండేవి. అవి కూడా కొత్త వ్యక్తులు ఆ వీధులకు ప్రవేశిస్తేనే మొరిగేవి. ప్రస్తుతం ప్రతి వీధిలో ఎటు చూసినా కుక్కలే ఎక్కువగా కనబడతాయి. అత్యవసర సమయంలో కాలినడకతో బయలుదేరితే వెంట పడుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముందుగా హొళగుంద మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి గ్రామం నుంచి కుక్కలను తరలించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జొన్న పంటను కోసేసిన దుండగులు

ప్రజాశక్తి- ఆలూరు

నియోజకవర్గంలోని ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామంలోని సర్వే నెంబర్ 177ఎ, 177సిలో ఉన్న 7 ఎకరాల పొలంలో సాగు చేసిన ఎర్ర జొన్న పంటను గురువారం అర్ధరాత్రి దుండగులు కోసేశారని బాధితులు వాపోయారు. శుక్రవారం మహిళ రైతు సంజమ్మ, ఆమె కుమారుడు అనిల్ కుమార్ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కె.వెంకటేష్, కె.నెటప్ప, దానప్పలు తాము సాగు చేసిన పంటను కోసుకెళ్లే అవకాశం ఉందని, గతేడాది జూన్ 10న ఆస్పరి పోలీసులకు విషయంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అనుకున్న విధంగానే 45 క్వింటాళ్లు ఉన్న ఎర్రజొన్న పంటను ఎత్తుకెళ్లారని ఎస్పీకి విన్నవించారు. అప్పు చేసి పంటను సాగు చేశామని, తీరా ఇలా చేయడం వల్ల తాము రూ.2 లక్షలకు పైగా నష్టపోయామని, న్యాయం చేయాలని కోరారు. తమ ఫిర్యాదుపై విచారించాలని ఆలూరు సిఐకి రెఫర్ చేసినట్లు తెలిపారు.

ఏ మొహం పెట్టుకొని 'గడపగడపకు' వెళ్తున్నారు

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

గ్రామాల్లో రోడ్లు వేయలేని నాయకులు ఏ మొహం పెట్టుకొని 'గడపగడపకు' వెళ్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ప్రశ్నించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజక వర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు, డ్రెయినేజీలు, తాగు నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరిష్కరించలేని నాయకులు గడపగడపలో ప్రజలకు మాయమాటలు చెప్పి కాలం వెళ్లబుచ్చుకుంటున్నారని చెప్పారు. గ్రామ పంచాయతీ నిధులను కూడా కాజేసి రాజకీయ పబ్బం గడిపే అధికార పార్టీ నాయకులు ఇంటికి వెళ్లే సమయం దగ్గరలోనే ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు త్వరలోనే చేపడుతున్న లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. టిడిపి నాయకులు నర్సప్ప, నారాయణ, భాస్కర్, చంద్రశేఖర్, కొమ్ము రామంజినేయులు పాల్గొన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

ఉరుసు ఉత్సవాల్లో కోట్ల సుజాతమ్మ

దేవనకొండ : మండలంలోని మాచాపురం గ్రామంలో హుస్సేనప్ప తాత ఉరుసు ఉత్సవంలో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ పాల్గొని పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ కార్యకర్త రామగుడ్డయ్యను పరామర్శించారు. అనంతరం గ్రామ నాయకులు సురేష్ ఇంట్లో విందుకు హాజరయ్యారు. టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, బడిగింజల రంగన్న, వీరేష్, సుభాన్, బండ్లయ్య, గిడ్డయ్య గౌడ్, మస్తాన్, మాజీ సర్పంచి నాగరాజు గౌడ్, రాజగోపాల్ గౌడ్, గ్రామ నాయకులు కురువ సురేష్, వీరన్న, ఏసు పాల్గొన్నారు.

వాలంటీరు వ్యవస్థపై ప్రజలకు తెలుసు

- ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం తగదు - ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ గురించి ప్రజలకు వాస్తవాలు తెలుసని, ప్రతిపక్ష పార్టీ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హితవు పలికారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాలంటీర్ల పని తీరు గురించి ప్రజలే సమాధానం చెబుతారని చెప్పారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఎల్లో మీడియా పనిగా పెట్టుకుని ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలతో దోపిడీకి పాల్పడితే, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. వారి సేవలను చూసి ఓర్వలేకనే వాలంటీర్ వ్యవస్థపై ఎల్లో మీడియా ద్వారా విమర్శలు వినిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఏ పార్టీతో పొత్తు లేకుండా చంద్రబాబు బాబు నాయుడు పోటీ చేయగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు సభకు వచ్చి అమాయక ప్రజలు మృతి చెందితే ఏమీ మాట్లాడలేని పవన్ కల్యాణ్ వైసిపి ప్రభుత్వం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పొద్దు పొడవక ముందే వాలంటీరు వ్యవస్థ ద్వారా పింఛన్లు పంపిణీ చేయడమే కాకుండా సచివాలయ ఉద్యోగులకు బాసటగా ఉంటూ, లబ్ధిదారులకు నేరుగా ఇంటి వద్దకే సుమారు 700 రకాల సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తన పాలనలో ఇచ్చిన 600 రకాలు హామీలు, వాటి అమలు గురించి ఈ ఎల్లో మీడియా ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. ఎపిలో అమలవుతున్న సంక్షేమ పథకాలే 2024లో వైసిపి అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని తెలిపారు.

'యువత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి'

- సెబ్ సిఐ వెంకట్

ప్రజాశక్తి-ఆలూరు

దేశంలో యువత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఆలూరు సిఐ వెంకట్ తెలిపారు. శుక్రవారం సెబ్ కార్యాలయంలో డివైఎఫ్ఐ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్ మాట్లాడారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ, కరోనా కష్టకాలంలో మృతదేహాల తరలింపు, నిత్యావసర సరుకుల పంపిణీ, కరోనా ఐసోలేషన్ సెంటర్‌లో వాలంటీర్లుగా పని చేశారని తెలిపారు. మహనీయుల వర్ధంతులు, జయంతుల సందర్భంగా రక్తదానం చేయడం, మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు చేయటం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని తెలిపారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ సమస్యల పరిష్కారం దిశగా అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించినట్లు తెలిపారు. డివైఎఫ్ఐ నాయకులు రంగస్వామి, పంపాపతి, విరుపాక్షి, సురేంద్ర పాల్గొన్నారు.